# అలసట

వొణుకుతున్న కీచుగొంతుకతో తనని నిద్రనించి లేపిన అలారం టైంపీస్‌ని ఊరుకో పెట్టి 'హాఁ' అని ఆవలిస్తూ మరోమంచం మీద పసిపాపలా నిద్రపోతున్న పెళ్లాం ముఖాన్ని ఒక క్షణం చూశాడు రవి. పెళ్లైనప్పట్నించీ నిద్రలేస్తూనే సీత అందమైన ముఖాన్ని చూడటం, వీలైతే ఓ బుగ్గ ఎంగిలిచేయడం అతను విధిగా పాటించే నియమం. ఎటొచ్చీ ఓ ఏడాది క్రితం నించీ 'ముద్దు' భాగం నిషిద్ధమైంది. సీతకీ రవికీ మధ్య జరుగుతున్న "శీతలయుద్ధం" కారణంగా.

తలగడ పక్కనున్న సిగరెట్ తీసి వెలిగించి పొగపీలుస్తూ అదంతా తలపోయసాగాడు రవి. తను పెళ్లై ఏడేళ్లు గడిచాయి. ఇద్దరు ముత్యాలవంటి బిడ్డలు కలిగారు. ఏం ఊహించని మార్పులు వస్తాయో మనుషుల్లో. సీతలో చిన్న తీవ్రత, పెద్ద నిరుత్సాహం కనపడసాగాయి తనకి. ఎందుకని అడిగితే ఏదో పెడసరంగా చెప్పేది. మొగాళ్ళకి స్వార్థమనీ, వాళ్ళకి స్త్రీని అణిచి ఉంచడమే తప్ప స్త్రీలో ఉన్న హృదయాన్ని గుర్తించే గుణం లేదనీ, స్లోగన్సు కొట్టడం మొదలెట్టింది.

సీత అలకకి అలసట కారణమని రవి అనుకున్నాడు. అలసిన కన్నులు కాంచేదేమిటి?

రోజు రోజుకీ వస్తువుల ధరలు పెరగడం, నిత్యం వచ్చిపోయే చుట్టాలూ, వాళ్ళకి చాకిరీ చేసి సీతా, రెండు ఉద్యోగాలు చేస్తూ తనూ అలసి పోతున్నారని అతనికి తెలుసు.

శరీరం అలిసిపోతే మనస్సూ అలసిపోతుంది. దానికి విచక్షణా జ్ఞానం నశిస్తుంది. మసక మసక అయిన మనస్సు కంటికి మనుషులు దెయ్యాల్లాగా, దెయ్యాలు దేవతల్లాగా కనిపిస్తారు. అంచేతనే స్పష్టమైన ఆలోచన లోపించిన సీతకోసం అంతా తనమీదా, మగజాతి మీదా ప్రసరిస్తోందని రవి ఏనాడో గ్రహించాడు.

అలసటకి మందు విశ్రాంతి.

కాని సీత అలిసిన మనస్సుకి మరో మందు వచ్చింది. "నేను ఉద్యోగం చేస్తా. నీ డబ్బుమీద ఆధారపడ్డం మానేస్తా నీ పొగరు తగ్గుతుంది." అంటూ ఓ ట్యుటోరియల్ కాలేజీలో పంతులమ్మగా చేరింది. అక్కడ రోజుకి ఆరుగంటలు క్లాసులు చెప్పాలి. నెలకి రెండు వందలిస్తాడు, "నా దోపిడీ కంటే నీకు ఆ కేపిటలిస్టుదోపిడీ బాగుందా సీతా? అతను మీ కాలేజీమీద ఏడాదికి లక్షన్నరలాభం కళ్ళ చూస్తున్నాడు. మీకు నెలకి వందా రెండువందలూ ముష్టి వేస్తున్నాడు. నా తల్లివికదూ మానెయ్" అని రవిఅంటే దెబ్బలాడి ఆరోజు తిండి మానే

సింది. సీత. రవి వాదించడం మానుకున్నాడు.

ఇవన్నీ గుర్తొచ్చి దిగులుతో మరో సిగరెట్ ముట్టించాడు రవి. గడియారం వెర్రి మొహం వేసుకుని చూస్తోంది.

సిగరెట్ అయ్యాక రవి మంచంమీంచి దిగి గబగబా స్నానాదికాలు ముగించి బొగ్గుల కుంపటి వెలిగించాడు. బొగ్గులు తడివేమో విసిరి విసిరి చేతులు నొప్పెట్టాయి, పొగతో కళ్ళు ఉబ్బాయి.

"పాపం సీత రోజూ ఈ కుంపటితో ఎలా బాధ పడుతుందో. ఇదే అసలైన వంటింటి బానిసత్వం. గ్యాస్ స్టౌ కొంటే ఈ బాధ ఉండదు." అనుకుంటూ గిన్నెతో నీళ్లు పెట్టాడు మరగడానికి. ఈ మధ్య కొన్ని నెలల్నుంచీ సీతకి ఇన్‌సోమ్నియా పట్టుకుంది. రోజూ రాత్రి రెండూ మూడు దాకా నిద్రపట్టదు. అంచేత రవి రోజూ అలారం పెట్టుకుని లేచి కొన్ని పనులు చేసేస్తున్నాడు సీత ఆలస్యంగా నిద్రలేచేసరికి.

ఇంతలో వీధి తలుపు బాదుతున్నారు ఎవరో. "పనిమనిషికి ఇలా బాదే అలవాటు లేదే, దానికీ విమెన్స్ లిబ్ గాలి సోకిందేమో" అని నవ్వుకుంటూ తలుపుతీసిన రవికి ఎదురుగా బావమరిది మోహన్ కనిపించాడు ఇకిలిస్తూ. మోహన్ ఎయిర్ బాగ్‌తో సహాతన రెండు చేతుల్నీ రవి చుట్టూవేసి "బావా, బావా, బావా!" అంటూ కావిలించుకున్నాడు. టాక్సీ వాళ్ళు వరసగా పెద్ద పెద్ద పేకేజీ పెట్టెలు తెచ్చి ఇంట్లోదించి డబ్బుల కోసం నిలబడ్డారు.

"ఎంత?" "పన్నెండు రూపాయలండి". రెండు ఎక్కువవేసి చెప్పాడతను. "ఇంకా నయం పన్నెండుడాలర్లనలేదు. ఈసారికి ఇస్తున్నా ఫో." అని ఇరవై రూపాయల నోటు ఇచ్చాడు మోహన్. వాళ్ళు నమస్కారాలు కొంచెం ఎక్కువగా చెప్పి వెళ్ళిపోయారు.

"అందరూ కులాసానా బావా? అక్కా పిల్లలూ ఇంకా నిద్రపోతున్నారా. అది చిన్నప్పటి నుంచీ అంతే. మొద్దునిద్దర" అంటూ తెగమాట్లాడేస్తున్నాడు మోహన్. అతను సీతకంటె రెండేళ్ళు చిన్న. నాలుగేళ్ళనించీ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. బాగా సంపాదించి విసుగెత్తి ఇండియా వచ్చేశాడు.

"మొన్ననే వస్తానన్నావుగా?" అన్నాడు రవి, కాఫీపొడరు నీళ్ళల్లో వేస్తూ.

"అలాగే వ్రాశానుకదూ మీకు. కాని వైజాగ్‌లో ప్లేన్ దిగాక మా క్లాస్‌మేట్ బడ్డూగాడులేడూ వాడు ఆపేశాడు. అమెరికాలో రకరకాల అమ్మాయిలతో నేనేదో స్వర్గసుఖాలు అనుభవించి ఉంటానని వాడిభ్రమ. చెప్పు చెప్పమని చంపేశాడు ఉన్న రెండు రోజులు. కాని మంచివాడులే. నేను ఏడాది క్రితం లెటర్ రాశాను వాడికి. మీకోసం ఓ కాల్ గాస్ స్టౌ సంపాదించమని మామూలుగా అయితే దొరకటం లేదని ఇన్‌ఫ్లుయెన్స్ ఉండాలనీ అయినా ట్రై చేస్తానని రాశాడు, ఆశ్చర్యం ఏమిటంటే నేను రాగానే గాస్ స్టౌ సిలిండర్‌తో సహా నాకు అప్పగించాడు. ఏదీ ఓ అట్లకాడ ఇలా పడేయ్" అని మోహన్ పేకేజీల మేకులు తీయటం మొదలు పెట్టాడు.

అది విని రవి కాఫీపొడుం పడగానే ఒకసారి పొంగేమరుగుతున్న నీళ్ళలా పొంగిపోయాడు. అతని ఆనందం హృదయం అంతా నిండిపోయి అంచులు దాటి వెల్లువలయ్యింది. ఇదే సీత

కోపానికి విరుగుడు. వంటలో కష్టం పోగానే నా మీద ఇష్టమూ వచ్చేస్తుంది. మునుపట్లా కాదు ఇంకా ఎక్కువగా. బ్రూ కాఫీలో ఓ బ్రాందీ చుక్క వేసుకు తాగినట్లు! హాయ్‌హాయ్" అనుకున్నాడు. పాలపేకెట్టుతో వచ్చిన పనిమనిషికి కాఫీ బాధ్యత అప్పగించి తనూ ఓ గరిటతో పేకేజీలు విప్పడం మొదలెట్టాడు రవి.

మోహన్ అమెరికానుంచి తెచ్చిన తన వస్తువులూ, అందరికీ తెచ్చిన కానుకలూ కాక, ఒక కాల్‌గాస్ స్టౌ (సిలిండర్‌తో సహా) ఒక ప్రెషర్ కుక్కర్, ఒక గ్రైండర్, ఇంకా సీత వంటింట్లోకి పనికివచ్చే ఎలక్ట్రికల్ మెషిన్లు ఉన్నాయి. వాటిలో అన్నీ తీసి వరుసగా వంటింట్లో తిన్నెమీద అమర్చారు బావా మరిదీ. రవికి ఆనందంతో కళ్ళు చెమర్చాయి. "మోహన్‌కి ఎంత ప్రేమ అక్కాబావ అంటే!" తమ సంసారంలోని కలతల గురించి ఒక్క మోహన్‌కే వ్రాసేవాడు రవి. అతని ఉత్తరాలకి వ్రాసే జవాబుల్లో ఏవో జోకులు మాత్రం వేసేవాడు మోహన్. "సందేశాలూ, పరిష్కారమార్గాలూ" ఏనాడూ సూచించలేదు.

"అమెరికాలో ఇంకా ఘోరం బావా, ప్రతి రెండు పెళ్ళిళ్ళకీ ఒకటి విడాకులే. అన్నీ అబ్బాయీ అమ్మాయీ వాళ్ళంతట వాళ్ళు చేసుకునే పెళ్ళిళ్ళేగా. పెళ్ళికి ముందర 'అన్నీ' చూసుకునే చేసుకుంటారు. అయినా ఏం తెగులో,"

"విమెన్స్ లిబ్ ఎలా వుంది అక్కడ" రవి నవ్వుతో అడిగాడు.

"మన నక్సలైట్ మూవ్‌మెంట్‌లాగే ఉంది. లక్షన్నర గ్రూపులు ఈ ఆడవాళ్ళ ఉద్యమంలో. మొగాళ్ళని ఎంత తిడతారో అంతకంటే ఓగ్రూప్‌ని ఓ గ్రూప్ ఎక్కువ తిట్టుకుంటుంది. ఏం లాభంలేదు.-" అని గొంతు తగ్గించి.

"ఇంతకీ అక్క ఉద్యమం ఎలా ఉంది." అన్నాడు మోహన్. "అలాగే ఉంది.కోల్డ్‌వార్. ఎప్పుడూ దిగులుగా ఉంటుంది. నన్ను హింసించడానికి అంతకంటె మంచి ఆయుధం ఏముంది? సీత అంటే నాకు ప్రాణం మోహన్. కాని నేనేదో తనని నిర్లక్ష్యం చేస్తున్నానని ఆమె నమ్మకం. ఆ మూడ్‌లో ఉన్నమనిషికి నేనేం చెప్పినా పురుషజాతి ఎల్లప్పుడూ స్త్రీ జాతికి చేసే అవమానం, మోసం, లాగే అన్పిస్తుంది. కుట్ర అనిపిస్తుంది."

పని మనిషి తెచ్చిన కాఫీ ఇద్దరూ త్రాగసాగారు.

"అంత అపార్థాలా?"

"దానికి తోడుగా తిట్టు సాహిత్యం ఒకటి వచ్చి పడింది నాప్రాణానికి.ఇంటిపని స్కూలు పనితో పగలంతా అలసిపోయిన మనిషి హాయిగా రాత్రి నిద్రపోవచ్చా? ఉఁ హుఁ రాత్రి పన్నెండూ ఒంటిగంటదాకా చదువూ ఆపుస్తకాల మీద మిగతా వాళ్ళతో చర్చలూ. పత్రికలకి వ్యాసాలు కూడా పంపుతోంది."

బలవంతంగా ఆపుకుంటున్న ఏడుపుతో మోహన్ ముఖం నిప్పుల మీద పడిన అప్పడంలా రకరకాల మెలికలు తిరుగుతోంది. "బావా, మీది ఒక్కటే ఆదర్శదాంపత్యం అనుకుంటూ వచ్చాను ఇన్నాళ్ళూ. మీకూ ఈ గొడవలు వచ్చాయంటే - నాకు జీవితం మీదే విరక్తి పుడుతోంది. ఇలాగయితే నాలాంటి వాళ్ళకి పెళ్ళే అనవసరం .ఏ సుఖమూ, తీపి లేనప్పుడు పెళ్ళి

చేసుకుని ఆతర్వాత బ్రతుకంతా పశ్చాత్తాపంతో ఏడవాలి." అన్నాడు బొంగురుపోయిన గొంతుతో.

రవి చిరునవ్వుతో "సమస్య మనం సృష్టించుకున్నదే కనుక పరిష్కారమూ మన చేతిలో ఉంటుందోయ్ బామ్మర్దీ. మగాళ్ళమీద ఆడాళ్ళకీ ఆడవాళ్ళ మీద మగాళ్ళకీ ద్వేషం రేకెత్తించే రచయితలకి ఈ సూత్రం వర్తించదనుకో. పరిష్కారం కోసం వాళ్ళ సందేశాలు సూక్తులూ కంఠతా పట్టిందిలే మీ అక్క. విందువు గాని, కాని రేపు చూడాలి ఎలా మారుతుందో" అన్నాడు రవి.

చల్లగా, తెల్లవారింది. సున్నితమైన కిరణాలతో సూర్యుడు అందర్నీ నిమురుతున్నాడు. మోహన్ ఇక ఆగలేక "అక్కా అక్కా" అంటూ సీత వీపు మీద బాదేసి లేపకొట్టాడు. పిల్లలూ లేచారు ఆ గొడవతో. సీత తమ్ముడి తలని గుండెకు హత్తుకుని కాసేపు ఏడిచింది. పిల్లలు మామ తెచ్చిన ఆట బొమ్మల్ని. కనుక్కొని వాటితో ఆడసాగారు. రవి సీతకి కూడా కాఫీ తెచ్చి యిచ్చాడు.

సీత ముఖం ముడుచుకుంది "తమ్ముడి దగ్గర పోజు కొడదామనా? మీరెంత మంచివారో అందరికీ తెలుసు!" అంది వెటకారంగా. రవీ, మోహనూ ఏం మాట్లాడలేదు.

కాఫీ తాగి మంచందిగి వెళ్ళి వంటింట్లోకి తొంగిచూసిన సీత ఆశ్చర్యంతో కెవ్వుమంది. మోహన్ అవన్నీ తెచ్చాడని గ్రహించి మురిసిపోయింది, ఊరికినే గేస్ స్టౌ వెలిగించేసి మిలమిలా మెరుస్తున్న ఆ మంటల్నీ స్టౌనీచూస్తూ కూర్చుంది. ప్రెషర్ కుక్కర్ మూత తీసి దాని గుట్టు మట్లన్నీ గ్రహించింది. గ్రైండర్ ఎలా పని చేస్తుందో చూపించమని మోహన్‌ని తొందరపెట్టి, అది నిమిషానికి ఎంత పప్పురుబ్బుతుందో తెలుసుకుంది. చేతులు చాపి ఇల్లంతా గిర్రున తిరిగింది.

"తమ్మూ, నీకున్న ఆప్యాయం మీ బావకి ఉంటే బాగుండేదిరా. ఒట్టి రాక్షసి మనిషి. కొరకరాని కొయ్య!" అని మోహన్‌తో చాడీలు చెప్పింది.

అలాగే గబగబా పళ్ళు తోముకుని స్నానంచేసి కొత్తబట్టలు వేసుకుని వంట మొదలెట్టింది సీత.

అరగంటలో వంట పూర్తయిపోయింది. సీత ఆనందానికి అవధులు లేవు. మూలని నల్లటి మోహం వేసుకుని కూర్చున్న బొగ్గుల కుంపటిని ఓ తాపు తన్నింది సీత. "చావు .... అంట్లమొహం నువ్వూను" అంటూ. ఆ కుంపటి మీదైతే వంట మూడు గంటలు పడుతుంది.

మోహన్ తనకు కానుకగా తెచ్చిన వంట యంత్రాలని విడవడం ఇష్టంలేక వంటింట్లోనే ఓ ఫేముకుర్చీ తెచ్చుకుని కూర్చుని తన అభిమాన రచయిత్రుల అమూల్య గ్రంథాలను చదవసాగింది సీత.

మోహన్,. రవి షికారుకు వెళ్ళిపోయారు పిల్లలను వెంట పెట్టుకుని.

అలా నాలుగురోజులు గడిచాయి. తనకి తోడు తమ్ముడుకూడా ఉంటాన, రవిని విమర్శించడం మరింత ఉత్సాహంగా సాగించింది సీత. సీత తనని ఏంతిట్టినా అడ్డుచెప్పద్దని రవి

ముందే హెచ్చరించి ఉంటాన మోహన్ ఓపికగా విన్నాడు. స్త్రీ స్వాతంత్ర్యం అవసరం అని ఒప్పుకున్నాడు. అమెరికాలో అందుకు నడుస్తున్న ఉద్యమం గురించి చెప్పాడు.

"ఆడదానివంటింటి బానిసత్వం పోవాలి" అని రచనలు చేసిన రచయితలు, రచయిత్రులు మాటలతో ఆగకుండా వంటలు నేర్చుకుని, భారీఎత్తున వంటలు చేసి, ఆడవాళ్ళందరికీ పీటలేసి కూర్చోపెట్టి మూడు పూటలా భోజనం పెడుతున్నారని చెప్పాడు. మొగాళ్ళ దౌర్జన్యాన్ని ద్వేషించే ఆడవాళ్ళు ఆడవాళ్ళనే పెళ్ళాడుతున్నారనీ మనదేశం "బేక్ వర్డ్ కంట్రీ" కనుక ఇంకా ఆభాగ్యం కలగలేదనీవాపోయాడు.

ఈ వారం రోజుల్లోనూ తనని విమర్శిస్తూ సీత కొన్ని వందల గంటలు మాట్లాడి ఉంటుంది. కాని మాటల్లో కసి. ఏడుపు, ద్వేషం తగ్గిపోతున్నాయని గమనించినా రవి ఊరుకున్నాడు. అపార్థాలు ఓ పట్టానపోవు. అవి అపార్థాలని మనిషి గ్రహించినా వాటి ముద్రలు నరాలలోపల కొన్ని ఉండిపోతాయి. అందుకే అతను సీతను చేరదీయడానికి ప్రయత్నించలేదు.

ఓరోజు సాయంత్రం వంటింట్లో కుర్చీలో కాలుమీద కాలేసుకుని కూర్చుని ఓకాలు ఆడిస్తూ కూనిరాగాలు తీస్తూ తన అభిమాన గ్రంథం (స్త్రీ జాతిని రక్షించడానికి ఉద్దేశించినది) చదువుతోంది సీత. స్టౌమీద ప్రెషర్ కుక్కర్ లయగా తబలా వాయిస్తున్నట్లు చప్పుడు చేస్తోంది.

ఆ సుందర దృశ్యాన్నికళ్ళార కొన్ని నిమిషాలు చూచి ఆమెను డిస్టర్బ్ చేయకుండా కాఫీ తాగాలని పిల్లిలా వచ్చిన భర్త రాకని పసికట్టి లేచినిలబడింది సీత. తనకుర్చీ చూపించి "కూర్చోండి, కాఫీ యిస్తాను" అంది. తనకి ఇలా మర్యాద జరిగి ఎన్నో యుగాలైనట్లు ఫీలవుతున్న రవి మౌనంగా కూర్చున్నాడు.

రవికి కాఫీ ఇచ్చి అతని కుర్చీ ప్రక్కనే నేలమీద కూర్చుంది సీత. ఒక నిముషం ఇద్దరూ మాట్లాడలేదు.

"ఏ మండీనేనొకటడుగుతాను చెప్తారా"

మళ్ళీ స్త్రీ హక్కుల గురించి వాదనేమోనని జడుసుకున్న రవి చేతిలోని కప్పు సాసర్ గజగజా వణికి పోయింది.

"ఈ స్టవ్వూ, ప్రెషర్ కుక్కరూ, గ్రైండరూ, ఎవరు కనిపెట్టారు?" ఫక్కున నవ్వాడు రవి ఎందుకంటే వాటిని అన్నిటినీ ఆడవాళ్ళ కోసం మగవాళ్ళే కనిపెట్టారు కాని అలాగంటే సీత ఉడుక్కుంటుందని ఊరుకున్నాడు.

"నవ్వుతారేం? నవ్వితే నేనసలు మాట్లాడను"

"నవ్వనులే."

"అయితే చెప్పండి మరి. ఈ స్టౌ అవీ వచ్చాక ఎంత హాయిగా ఉందో తెలుసా. అసలు మీమీద కోపం కూడా రావటం లేదు కూడాను."

"అవి నేనేం కొనలేదుగా. తమ్ముడు తెచ్చాడు అప్పకోసం"

"ఆ వెటకారం చూస్తేనే నాకుమండుతుంది. కాల్ గాస్ ఎవరు కనిపెట్టారు?"

"గుడిపాటి వెంకట చలం అనీ ఓ గొప్ప ఇంజనీర్. ఆయన తడి కట్టెల్తోనూ, బొగ్గుల తోనూ వంటచేయలేక బాధ పడుతున్న స్త్రీ జాతిని హాయిగా ఉంచడానికి కనిపెట్టాడు.

చలం అసలు పేరు గుడిపాటి వెంకట చలం అనీ తెలియని సీతకి ఆ జవాబు సమంజసంగానే తోచింది.

"మరి ఈ గ్రైండరో"

"అదా. అది. డా॥ ప్రజా నాయకమ్మ అని మరో ఇంజనీరు. ఆవిడ కనిపెట్టారు".

రవి తనను ఆటపట్టిస్తున్నాడని ఈసారి గ్రహించిన సీత సిగ్గుతో ముడుచుకు పోయి తను అంతవరకూ చదివిన గ్రంధాన్ని స్టౌ మీది మంటలో పడేసి, సజల నేత్రాలతో అది మండటాన్ని చూస్తుంటే ఆమెను చేతుల్లోకి తీసుకుని. "ఎలా ఉంది పుస్తకం" అన్నాడు రవి. కొద్ది క్షణాల్లో పుస్తకంపోయి మసి మిగిలింది.

(ప్రభవ; మాసపత్రిక –)

★